క్లుప్తంగా

జగనన్న పాల వెల్లువతో పాడి రైతులకు లబ్ధి

అల్లవరం: మహిళా పాడి రైతులు ఆర్థికంగా స్థిరపడాలన్న లక్ష్యంతో జగనన్న పాల వెల్లువ పథకాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతుందని పశువైద్యాధికారి ఎంవీవీ ఎస్ఎల్ నారాయణరావు అన్నారు. తూర్పులంక గ్రామ సచివాలయంలో సర్పంచ్ కడలి గంగాచలం అధ్యక్షతన సోమవారం జగనన్న పాల వెల్లువపై పాడి మహిళా రైతులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు పాడి రైతుల నుంచి పాలు కొనుగోలు చేస్తారన్నారు. గ్రామాల్లో 11 మంది మహిళా రైతులను సంఘాలుగా ఏర్పాటు చేసి పది రోజులకు ఒకసారి పాల డబ్బులను లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏపీఎం సయ్యద్, పి.శ్రీమన్నారాయణ, శివరామకృష్ణ, కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నవోదయకు ఎంపిక


కొడమంచిలి వర్షిత

ముమ్మిడివరం: ముమ్మిడివరం మండలం అనాతవరం శ్రీవాణి యూపీ స్కూలుకు చెందిన కొడమంచిలి వర్షిత జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించింది. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ మిమ్మిర్తి చిరంజీవి, ఉపాధ్యాయులు విద్యార్థిని వర్షితను అభినందించారు.

సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించాలి


జన విజ్ఞాన వేదిక పోస్టర్‌ను ఆవిష్కరించిన ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం

యానాం: సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించడం ద్వారా ప్రజలు నిర్భయంగా తమ జీవితాన్ని గడపొచ్చని ప్రముఖ కవి, జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు దాట్ల దేవదానంరాజు పేర్కొన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సభ్యత్వ వాల్‌పోస్టర్‌ను స్థానిక ఆర్ఏఓ చాంబర్‌లో రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు కేవీవీ సత్యనారాయణ జన విజ్ఞాన వేదిక చేస్తున్న కార్యక్రమాలు, సదస్సుల గురించి వివరించారు. యానాంలో సభ్యత్వాలు పూర్తి చేసి త్వరలో మహాసభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రఘునాయగం, అధ్యక్షుడు ఆనాల వీరభద్రరావు, ఉపాధ్యక్షుడు కాశి జానకిరాముడు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సేవాదళ్ కన్వీనర్‌గా భూసారపు


పద్మారావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: వైఎస్సార్ సీపీ తాళ్లరేవు మండల సేవాదళ్ కన్వీనర్‌గా తాళ్లరేవుకు చెందిన సీనియర్ నాయకుడు భూసారపు పద్మారావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నుంచి ఉత్తర్వులు అందినట్లు పద్మారావు సోమవారం విలేకర్లకు తెలిపారు. తనను పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్‌గా నియమించిన ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు, పదవి రావడానికి సహకరించిన ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పద్మారావును ఎమ్మెల్యే పొన్నాడ దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు.

మడ అడవుల రక్షణ అందరి బాధ్యత

కాట్రేనికోన: తుపాన్లు, సునామీలు వంటి ప్రకృతి వైపరీత్యాల నుంచి తీరగ్రామాలకు రక్షణ కవచాలుగా నిలుస్తున్న మడ అడవులను రక్షించుకోవలసిన బాధ్యత అందరిపై ఉందని డీడీ ఎఫ్ఓ ఎన్‌బీఎస్‌వీ హరికుమార్ అన్నారు. బలుసుతిప్పలో సోమవారం ఎఫ్‌డీఓ రామకృష్ణ అధ్యక్షతన మత్స్యకారులకు నిర్వహించిన శిక్షణ తరగతులకు మత్స్యశాఖ జేడీ లాల్‌మహ్మద్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వర్షాకాలంలో ఎండు చేపలు, రొయ్యలు తయారీ కోసం మడ అడవులను నరకొద్దని, స్మోకింగ్ మిషన్లను ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం సమకూర్చిన స్మోకింగ్ మిషన్లను లబ్ధిదారులకు అందచేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం తహసీల్దార్‌గా విజయశ్రీ

ముమ్మిడివరం: ముమ్మిడివరం తహసీల్దార్‌గా సీహెచ్ విజయశ్రీ నియమితులయ్యారు. కాకినాడ మండలంలో పనిచేస్తున్న విజయశ్రీ బదిలీపై ముమ్మిడివరం వచ్చి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇప్పటివరకూ ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్ యడ్ల రాంబాబు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించారు.

సమీకృత వ్యవసాయం.. నికర ఆదాయం..

- తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు
- ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం.. ఆసక్తి చూపుతున్న రైతులు


చొల్లంగిలో ఏర్పాటు చేస్తున్న సమీకృత వ్యవసాయ సాగు క్షేత్రం

తాళ్లరేవు: అన్నదాతకి ప్రతి నెలా నికర ఆదాయం వస్తే ఎలా ఉంటుంది..? ఇదే ఆలోచనతో ప్రభుత్వం సమీకృత వ్యవసాయాన్ని(ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం) తీసుకొచ్చింది. ఈ విధానంలో రైతుకి ఉన్న భూమిలోనే కొంత భాగంలో వరి పండిస్తూనే మిగిలిన స్థలంలో రొయ్యలు, చేపలు, నాటుకోళ్లు, గొర్రెల పెంపకంతో పాటు కూరగాయలు, ఆకుకూరలు తదితర పంటలు పండిస్తారు. దీనివల్ల ఒక పంటలో నష్టమొచ్చినా మిగిలిన పంటల్లో లాభం రావడమే కాదు రైతులు ప్రతి నెలా నికర ఆదాయం పొందేందుకు అవకాశముందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. వరి, ఆక్వా పరిశ్రమల్లో నష్టాల పాలైన రైతులకు ఈ విధానం ఒక ప్రత్యామ్నాయంగా కనిపిస్తుంది.

చిన్న, సన్నకారు రైతులకు వరం

ఒకప్పుడు అధిక శాతం మంది వ్యవసాయం చేయగా తరువాత కాలంలో వ్యవసాయానికి దీటుగా ఆక్వా పరిశ్రమ వృద్ధి చెందింది. అయితే ఆక్వా పరిశ్రమలోనూ వరుస నష్టాలు సంభవించడంతో ప్రస్తుతం రైతులు సమీకృత వ్యవసాయం వైపు చూస్తున్నారు. ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రోత్సహించేందుకు రైతులకు రైతు భరోసా కేంద్రాల ద్వారా అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే తాళ్లరేవు మండలంలో వ్యవసాయాధికారి ఎస్.ప్రశాంతి పర్యవేక్షణలో చొల్లంగి రైతు భరోసా కేంద్రం పరిధిలో కట్టిమేను నూకరాజు అనే రైతు సమీకృత వ్యవసాయ సాగును చేపట్టారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులకు సమీకృత వ్యవసాయం(ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ సిస్టం) ఒక వరంలా మారనుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

సమీకృత వ్యవసాయం ఎలా..?

సమీకృత వ్యవసాయంలో రైతుకి ఉన్న మొత్తంగా 1.50 ఎకరాల భూమిలో గాను 80 సెంట్లలో వరి సాగు, 20 సెంట్లలో చేపల పెంపకం, 10 సెంట్లలో కాలువపై నాటుకోళ్ల పెంపకం, 20 సెంట్లలో కూరగాయలు, ఆకుకూరలు తదితర వాటిని సాగు చేయిస్తారు. అలాగే మిగిలిన 20 సెంట్ల భూమిలో గొర్రెల పెంపకం, ఇతర గడ్డి జాతి పెంపకం చేపడతారు. ఈ విధానంలో రైతులకు ఒక పంటలో నష్టం వచ్చినా మిగిలిన పంటల్లో లాభాలు ఆర్జించొచ్చు. సాధారణంగా వరి, ఆక్వా పంటల దిగుబడులు చేతికి రావాలంటే సుమారు నాలుగు నుంచి ఆరు నెలల కాలం పడుతుంది. అదేవిధంగా ఒక ఎకరా సాగుకు సుమారు రూ.లక్షకు పైగానే ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే సమీకృత వ్యవసాయ విధానం ద్వారా తొలి సంవత్సరం దాదాపుగా రూ.35 నుంచి రూ.50 వేలు ఖర్చవుతుంది. పెట్టుబడి పెట్టిన ఐదు నెలల నుంచి ప్రతి నెల రైతుకు ఆదాయం సమకూరుతుంది. ఒక ఏడాదిలో రూ.లక్షకు పైగా ఆదాయం సమకూరే అవకాశం ఉండడంతో ప్రభుత్వం ఈ విధానాన్ని ప్రోత్సహిస్తుంది.

రైతులకు ఎంతో మేలు



సమీకృత వ్యవసాయం విధానం ద్వారా చిన్నపాటి స్థలంలోనే వరి, కూరగాయలు, ఆకుకూరలు పండించడంతో పాటు చేపలు, నాటుకోళ్లు, గొర్రెల పెంచుతారు. రైతుకు ఒక పంటలో నష్టమొచ్చినా మిగిలిన పంటల్లో లాభాలు ఆర్జించొచ్చు. దీని వల్ల రైతులకు ఆర్థికంగా ఎంతో మేలు జరుగుతుంది.
– ఎస్.ప్రశాంతి, వ్యవసాయాధికారిణి, తాళ్లరేవు మండలం

ప్రతి నెలా నికర ఆదాయం



సమీకృత వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితోనే ప్రతి నెలా నికర ఆదాయం పొందొచ్చు. ఏడాదిలో రూ.లక్షకు పైగా ఆదాయం సమకూరే అవకాశముంది. దీనికి సంబంధించి రైతు భరోసా కేంద్రం ద్వారా ఇప్పటికే రైతులకు అవగాహన కల్పించి ఫార్మ్‌లు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు చేపడుతున్నాం.
– వి.వెంకట రమణ, గ్రామ వ్యవసాయ సహాయకుడు, చొల్లంగి రైతు భరోసా కేంద్రం

ప్రభుత్వ ప్రోత్సాహంతోనే సాగు



మా పూర్వీకుల నుంచి వ్యవసాయం చేస్తున్నాం. ఆక్వా సాగు కూడా చేపట్టాం. అయితే ఆక్వా సాగు తీవ్ర ఒడిదొడుకులకు లోనుకావడంతో ప్రభుత్వం ప్రోత్సాహంతో సమీకృత వ్యవసాయం వైపు అడుగులేశాను. చేపలు, కోళ్లు, గొర్రెల పెంపకంతో పాటు ఆకుకూరలు, కాయగూరలు పండించడానికి అంతా సిద్ధం చేసుకున్నాను.
– కట్టిమేను నూకరాజు, రైతు, చొల్లంగి గ్రామం

ముమ్మిడివరంలో స్కిల్ హబ్

ముమ్మిడివరం: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ముమ్మిడివరంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోకమాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్కిల్ హబ్ ద్వారా నియోజకవర్గ పరిధిలో మల్టీ స్కిల్ టెక్నీషియన్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నారు. స్థానిక పరిశ్రమల సహకారంతో ఇండస్ట్రీ నైపుణ్య ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ పొందిన అభ్యర్థులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ చదువుకున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. బయో డేటా, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, విద్యార్హత సర్టిఫికెట్‌తో హాజరుకావాలని ఆయన సూచించారు.

ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాలకు ఆహ్వానం

యానాం: స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో 2023–24 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ కృష్ణసుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ఆపరేటర్, ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, మెకానిక్ మోటార్ వెహికల్, వైర్‌మెన్ తదితర ట్రేడుల్లో అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ కాలంలో ప్రతి నెలా రూ.1,000 స్టైఫండ్, ఉచిత యూనిఫాం, షూ, మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ప్రాక్టికల్ ఆధారిత శిక్షణ ఉంటుందన్నారు.

కౌమార దశ చాలా కీలకం


యూత్ ఫెస్ట్‌పై శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: ఎంతో కీలకమైన కౌమార దశలో విద్యార్థులు చెడుదోవ పట్టకుండా చూడాల్సిన ఆవశ్యకత ఉందని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎస్ఎస్ఏ కాన్ఫరెన్స్ హాలులో పుదుచ్చేరి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో యూత్ ఫెస్ట్ నిర్వహణ కోసం కంప్‌లెంట్ ఆఫీసర్స్‌కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే పుదుచ్చేరివ్యాప్తంగా 180 కంప్‌లెంట్ ఆఫీసర్లను నియమించి వారికి శిక్షణ పూర్తిచేసి బాధ్యతలను అప్పగించారన్నారు. సదస్సులో భాగంగా యానాంలో సైతం హెచ్ఐవీ, ఎయిడ్స్ నివారణకు సంబంధించి సంబంధిత పాఠశాల, కళాశాల, హెల్త్‌కేర్, పరిశ్రమలకు సంబంధించి కంప్‌లెంట్ ఆఫీసర్లకు శిక్షణనిచ్చారు. యూత్ ఫెస్ట్‌లో భాగంగా క్విజ్, నాటక పోటీలు, 5కేఎం పరుగు తదితర పోటీల నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎస్.చిత్రాదేవి, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యం

ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్


పెదమడిలో ఇంటింటికీ కుళాయి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ఐ.పోలవరం: ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీరందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులు సమకూరుస్తుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ఐ.పోలవరం మండలం పెదమడి గ్రామంలో రూ.45 లక్షలతో నిర్మించిన జలజీవన్ మిషన్ ఇంటింటికీ కుళాయి పథకాన్ని, పెద వంతెన వద్ద రూ.29 లక్షల ఓఎన్‌జీసీ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకును సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ తీర గ్రామాల ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా ఓఎన్‌జీసీ, జలజీవన్ మిషన్ ద్వారా నిధులు కేటాయించి వాటర్ ట్యాంకులు నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మోర్త మిరియంజ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్‌రాజు, మండల పార్టీ కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు, గ్రామ సర్పంచ్ దంతులూరి రాఘవరాజు, దంగుడు బియ్యం వెంకట సుబ్బయ్య, ఢిల్లీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకంతో ఎంతో మేలు

- ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్
- అల్లవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం


అల్లవరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, శ్రీకాంత్

అల్లవరం: సంక్షేమ పథకాలు వర్తించనివారిని గుర్తించి వారికి లబ్ధి చేకూర్చేందుకు తీసుకొచ్చిన జగనన్న సురక్ష పథకంతో ఎంతో మేలు జరుగుతుందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అల్లవరం–1 సచివాలయంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, మంత్రి తనయుడు పినిపే శ్రీకాంత్ సోమవారం నిర్వహించారు. అల్లవరం సచివాలయం పరిధిలోని గోసంగివారిపేట, సాపేవారిపేట, గుత్తులవారిపాలెం, ఎదుర్లపాలెం ప్రాంతాల్లో వారిద్దరూ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల్ని లబ్ధిదారులకు వివరించడంతో పాటు గ్రామంలో నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ జులై 1 నుంచి ప్రభుత్వం జగనన్న సురక్ష పథకం ద్వారా కుల, ఆదాయ, మ్యుటేషన్, తదితర పత్రాలను ఉచితంగా అందిస్తుందన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలను స్వయంగా కలుసుకుని వారి సమస్యలను తెలుసుకునే అవకాశం దక్కుతుందన్నారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో అమలుచేయలేనన్ని పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాద్, సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపీటీసీ నిచ్చెనకోళ్ల మాణిక, సొసైటీ చైర్మన్ యల్లమిల్లి బోసు, ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి నరసింహరావు, మెరికల శ్రీను, తుట్టిపు బాబి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న భూసర్వేతో శాశ్వత భూహక్కు


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సంపదరావు

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకొచ్చిన జగనన్న భూసర్వేతో సరిహద్దు, భూసమస్యలు పరిష్కారమై శాశ్వత భూహక్కు లభిస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు అన్నారు. మండలంలోని సన్నవిల్లి గ్రామంలో జగనన్న భూసర్వేపై అవగాహన కల్పించేందుకు నిర్వహించిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శతాబ్ది కాలం తరువాత మళ్లీ రీసర్వే జరిపి భూసమస్యలను నివారించడానికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. తహసీల్దార్ జె.వెంకటేశ్వరి మాట్లాడుతూ గతంలో డ్రోన్‌తో ఏరియల్ సర్వే జరిపామని, దాని ఆధారంగా గ్రామ స్థాయిలో సిబ్బంది బృందాలుగా పర్యటించి కొలతలు గుర్తించి హద్దురాళ్ల పాతుతారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వంగా గిరిజాకుమారి, వైఎస్సార్ హార్టికల్చర్ బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, గనిశెట్టి సత్యనారాయణ, రీసర్వే డీటీ వైవీవీఎస్ సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి తదితరులు పాల్గొన్నారు.

బాలుడి ఆపరేషన్ కోసం రూ.15 వేల విరాళం


బాలుడి తండ్రి సత్యనారాయణకు సొమ్ము అందజేస్తున్న కలెక్టర్ కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: ముమ్మిడివరానికి చెందిన ఏడాది బాలుడు నెర్లగంటి షణ్ముఖ వెంకట్‌కి హెర్నియా ఆపరేషన్ కోసం వలంటీర్లు రూ.15 వేలు విరాళాలు సేకరించారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో బాలుడి తండ్రి సత్యనారాయణకు సొమ్మును అందజేశారు. తన కుమారుడి పరిస్థితిని వివరించి ఆర్థిక సాయాన్ని కోరుతూ బాలుడి తండ్రి సత్యనారాయణ ఇటీవల సోషల్‌మీడియాలో పెట్టిన పోస్టు చూసి స్పందించామని వలంటీర్లు చెప్పారు. ఈ సందర్భంగా వలంటీర్ల బృందాన్ని జిల్లా కలెక్టర్ అభినందించారు.

మత్తు నుంచి సమాజాన్ని కాపాడదాం


ర్యాలీలో పాల్గొన్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శంకరరావు, వైద్యురాలు సౌమ్య


సుంకరపాలెం జంక్షన్‌లో మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

అమలాపురం టౌన్: మత్తు పదార్థాల నుంచి సమాజాన్ని కాపాడదామని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఆస్పత్రి మానసిక వైద్యురాలు డాక్టర్ సౌమ్య పసుపులేటి ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జరిగిన అవగాహన ర్యాలీలో డాక్టర్ శంకరరావు మాట్లాడారు. ర్యాలీ ఆస్పత్రి ఆవరణ నుంచి నల్ల వంతెన వరకూ సాగింది. మానసిక వైద్యురాలు డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ మత్తును అలవాటుగా చేసుకుని బానిసలై బతుకు బుగ్గి పాలు చేసుకోవద్దని సూచించారు. అనంతరం మత్తుకు దూరంగా ఉంటామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీలో ఆస్పత్రి వైద్యులు, నర్సులు, మత్తు పదార్థాల విమోచన కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యానాం: డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్పీ రఘునాయగం, ఎస్ఐ శేరు నూకరాజు, ట్రాఫిక్ ఎస్ఐ పువ్వల వీరభద్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

గిరియాంపేటలో...

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక గిరియాంపేట పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్‌లో ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ఉమాఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు దంగేటి త్రిమూర్తులు మాట్లాడుతూ మత్తుపదార్థాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కె.శ్రీనివాస్, ఎఎస్ఐ కాలే సుబ్రహ్మణ్యం, వినాయకరావు తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ

తాళ్లరేవు: ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ భవానీ ఆధ్వర్యంలో సోమవారం సుంకరపాలెం జంక్షన్‌లో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ భవానీ మాట్లాడుతూ మద్యం సేవించడంతో ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎంవీవీ కుమార్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: మాదక ద్రవ్యాల రహిత సమాజం స్థాపనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ముమ్మిడివరం కోర్టు న్యాయమూర్తి మహమ్మద్ రహంతుల్లా పిలుపునిచ్చారు. చెయ్యేరు శ్రీనివాస ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అటానమస్ కళాశాలలో సోమవారం అంతర్జాతీయ మాదక ద్రవ్య నియంత్ర దినోత్సవం ప్రిన్సిపాల్ సీహెచ్ వీఎస్ పరమేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డీవీఎస్ఎన్ వర్మ, కాట్రేనికోన డిప్యూటీ తహసీల్దార్ ఝాన్సీ, ఎస్ఐ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నియంత్రణలో భాగస్వాములవుదాం

అమలాపురం టౌన్: మాదక ద్రవ్యాల నియంత్రణలో అంతా స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఈఆర్ సుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో సోమవారం సాయంత్రం జరిగిన జేవీవీ జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత జేవీవీ ప్రతినిధులు అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. కొందరు డ్రగ్స్‌కు బానిసలై కుటుంబ బంధాలను కోల్పోయి చివరకు దిక్కులేని చావును తెచ్చుకుంటున్నారని జేవీవీ జిల్లా కార్యదర్శి కేవీవీ సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా డ్రగ్స్ ఉచ్చులో యువత పడకుండా ఆయా కుటుంబాలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మత్తు పదార్థాల నియంత్రణకు తమ వంతు కృషి చేస్తామంటూ జేవీవీ ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. సమావేశంలో జేవీవీ ప్రతినిధులు ఎం.వెంకటేశ్వరరావు, పి.భాస్కరరావు, బీఎస్ వెంకటేశ్వరరావు తదితరులు ప్రసంగించారు.

వాడపాలెం చానల్స్‌కు నీరు విడుదల


వాడపాలెం చానల్‌కు నీరు విడుదల చేస్తున్న ఏఏబీ చైర్మన్ శ్రీనివాస్

కొత్తపేట: ప్రస్తుత ఖరీఫ్(తొలకరి) సీజన్‌లో రైతులు వరినాట్లు త్వరగా వేసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి (ఏఏబీ) చైర్మన్ పెదపూడి త్రిమూర్తిశ్రీనివాస్ సూచించారు. వాడపాలెం లాకుల పైన వాడపాలెం న్యూ చానల్ కింద సుమారు 1400 ఎకరాలకు సాగునీటిని విడుదలన చేశారు. స్థానిక ఇరిగేషన్ ఏఈ వి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఏబీ చైర్మన్ పెదపూడి త్రిమూర్తిశ్రీనివాస్ చానల్‌కు సోమవారం నీటిని విడుదల చేశారు. చానల్స్‌లో తూటు, తుక్కు, పూడికతో నిండిపోవడంతో ఖరీఫ్, రబీ సీజన్‌లకు సాగునీరు అందేది కాదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దాంతో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కృషి మేరకు రూ.4 లక్షలు మంజూరు కాగా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాడపాలెం రైతు సంఘం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

29న రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి రాక

యానాం: పుదుచ్చేరిలోని ఏకైక రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి ఈ నెల 29న యానాంలో పర్యటిస్తారని సోమవారం యానాం బీజేపీ శాఖ అధ్యక్షుడు కనకాల రాజు, నాయకుడు కనకాల రామదాసు తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి తదితర అంశాలపై జరిగే బీజేపీ అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌లో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను తెలుసుకుంటారని చెప్పారు. అదేవిధంగా వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో సైతం పాల్గొంటారన్నారు.

1 నుంచి ఇంటి వద్దకే అంగన్‌వాడీ సరకులు

తాళ్లరేవు: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరకులను వచ్చే నెల 1వ తేదీ నుంచి ఇంటి వద్దకే అందజేయనున్నట్లు తాళ్లరేవు ఐసీడీఎస్ సీడీపీఓ వి.మాధవి తెలిపారు. సోమవారం తాళ్లరేవు పంచాయతీ పరదేశమ్మ కేంద్రం వద్ద సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి అధ్యక్షతన గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల్లో పోషకాహార లోపం రాకుండా నివారించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేస్తున్నారన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చిట్టూరి చలపతి, సూపర్‌వైజర్ జె.నిభావణి, ఎంఎస్‌కే విజయభవాని, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కిక్ బాక్సింగ్‌లో ప్రథమ స్థానం సాధించిన సంధ్యారాణి

రావులపాలెం: విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి ప్రోకిక్ బాక్సింగ్ సీనియర్ లీగ్‌లో రావులపాలెనికి చెందిన వీటి సంధ్యారాణి ప్రథమ స్థానంలో నిలిచినట్టు కోనసీమ జిల్లా కిక్ బాక్సింగ్ సెక్రటరీ ఈ సత్యశ్రీ సోమవారం తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో విశాఖపట్నం బీచ్ రోడ్డులో, విశాఖపట్నం కిక్ బాక్సింగ్ అసోసియేషన్ నిర్వహించిన సీనియర్ రాష్ట్రస్థాయి ప్రో కిక్ బాక్సింగ్ లీగ్ సీనియర్స్ పోటీల్లో రావులపాలెం సత్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థిని వీటి సంధ్యారాణి 57 కేజీ మహిళా విభాగంలో పాల్గొని ప్రథమ స్థానం సాధించి బెల్ట్‌ను కైవసం చేసుకుందన్నారు. బహుమతి ప్రదానం రాష్ట్ర కిక్ బాక్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ సెక్రటరీ బి.శామ్యూల్ రాజ్ చేతుల మీదుగా బెల్ట్ అందుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిక్ బాక్సింగ్ ప్రెసిడెంట్ టెంకి దుర్గ, జిల్లా సెక్రటరీ గుడాల రాంప్రసాద్, టెక్నికల్ ఇన్‌చార్జి నారాయణరావు, కిక్ బాక్సింగ్ మాస్టర్స్ పాల్గొన్నట్టు సత్యశ్రీ తెలిపారు.